సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 14 । జనవరి । 2024



రూ.50 వేల విరాళం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకుల వసతి గృహాల నిర్మాణానికి యేడిద రాఘవులు కుటుంబ సభ్యులు (వెత్సావారి అగ్రహారం) శనివారం రూ.50 వేల విరాళం అందజేశారు.



శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

II లో

డెల్టాలకు 8,050 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శనివారం 8,050 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,750, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.05 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ప్రజలకు కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు



కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ కె.మాధవీలత శనివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలియ చేశారు. ప్రతి ఇంటా సిరులు కురవాలని, ఆరోగ్యం, ఆనందాలు వెదజల్లాలని ఆకాంక్షించారు. సంక్రాంతి సెలవు కారణంగా ఈ సోమవారం స్పందన కార్యక్రమం జరగదని తెలిపారు.

నూతన క్యాథ్ ల్యాబ్‌లో తొలి యాంజియోగ్రామ్



తొలి యాంజియోగ్రామ్ విజయవంతం కావడంతో ఆసుపత్రి అధికారులు, వైద్య బృందాల హర్షం

కాకినాడ క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 3న వర్చువల్‌గా ప్రారంభించిన కాకినాడ జీజీహెచ్ క్యాథ్ ల్యాబ్‌లో శనివారం తొలి యాంజియోగ్రామ్ పరీక్ష విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్, హెచ్‌ఓడీ డాక్టర్ హరి విజయకుమార్ పర్యవేక్షణలో కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంతి ఈ పరీక్ష నిర్వహించారని తెలిపారు. ఇందులో క్యాథ్ ల్యాబ్ టెక్నికల్ స్టాఫ్ జీవన్‌కుమార్, స్టాఫ్ నర్సులు స్వప్న, అనితాదేవి కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. మర్రివాడ గ్రామానికి చెందిన అప్పన్న ఆదినారాయణ అనే 55 ఏళ్ల వ్యక్తికి యాంజియోగ్రామ్ చేశారని తెలిపారు. ఆయన గుండెకు రక్తం సరఫరా చేసే నాళంలో 90 శాతం మేర బ్లాక్ అవడంతో ఈ పరీక్ష చేశారన్నారు. ఈ క్యాథ్ ల్యాబ్ ఎందరో పేద రోగుల ప్రాణాలు కాపాడనుందని అన్నారు. ఈ క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుకు వంగా గీత తన ఎంపీ లాడ్స్ నిధుల నుంచి రూ.7 కోట్లు పైగా కేటాయించారన్నారు. క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుకు ఎంతో కృషి చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా, వైద్య విద్య సంచాలకుడు నరసింహానికి డాక్టర్ లావణ్యకుమారి కృతజ్ఞతలు తెలిపారు. యాంజియోగ్రామ్ నిర్వహించిన వైద్య బృందాన్ని, సిబ్బందిని సూపరింటెండెంట్‌తో పాటు డీసీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ అనిత, ఆర్ఎంఓ డాక్టర్ యమున అభినందించారు.

స్వామిని చూడగ.. మది మురవగ

అప్పనపల్లిలో భక్తుల కోలాహలం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయమే పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2.41 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.24 లక్షలు, నిత్యాన్నదానానికి రూ.1.16 లక్షలు విరాళాలుగా వచ్చాయి. స్వామివారిని 3,072 మంది భక్తులు దర్శించుకోగా, 2,049 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. కొమరాడకు చెందిన కేతా శేషలత కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.25 వేల విరాళం సమర్పించారు. దాతకు ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టీలు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

పండగ కిటకిట

- సంక్రాంతి ప్రయాణాల్లో ప్రజలు
- రద్దీగా బస్సులు, రైళ్లు
- కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు



ఎక్కాల్సిన బస్సు కోసం ఎదురుచూపులు : కిటకిటలాడుతున్న రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పండగ రానే వచ్చేసింది. మూడు రోజుల ఈ ముచ్చటైన పండగలో మొదటిదైన భోగి ఆదివారమే. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా బస్సులు, రైళ్లు కిటకిటలాడాయి. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లు పండగ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి జిల్లాలోని గ్రామాలకు వచ్చే వారితో పాటు, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లే ప్రయాణికులతో రద్దీగా మారాయి. సంక్రాంతి పండగ వస్తోందంటే చాలు.. ఏటా సొంతూళ్లకు చేరుకునేందుకు, అక్కడి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో ఆనందంగా గడిపేందుకు వేలాది మంది సిద్ధమవుతారు. వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ, ఏపీఎస్ ఆర్టీసీ నిత్యం నడిపే వాటితో పాటు ఇప్పటికే ప్రత్యేక రైళ్లు, బస్సులు నడుపుతున్నాయి.

6 వేల మంది రాక

సంక్రాంతి పండగకు తెలంగాణలోని హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికుల కోసం ఆర్టీసీ జిల్లాలోని నాలుగు డిపోల ద్వారా 68 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు నడిపింది. రాజమహేంద్రవరం నుంచి 42, గోకవరం నుంచి 16, కొవ్వూరు నుంచి 7, నిడదవోలు డిపో నుంచి 3 చొప్పున ప్రత్యేక బస్సులు నడిపారు. విశాఖపట్నానికి 54, విజయవాడకు 18 చొప్పున కూడా ప్రత్యేక బస్సులు నడిపారు. వీటితో పాటు గుంటూరుకు కూడా ప్రత్యేక బస్సులు నడిపారు. ఈ నెల 10 నుంచి శనివారం వరకూ నడిచిన ఈ ప్రత్యేక బస్సుల ద్వారా సుమారు 6,000 మంది ప్రయాణికులు జిల్లాకు చేరుకున్నారు. ప్రత్యేక బస్సులు కాకుండా జిల్లాలోని నాలుగు డిపోల నుంచి హైదరాబాద్‌కు ప్రతి రోజూ 12 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. గత ఏడాది ఆర్టీసీ 63 ప్రత్యేక బస్సులు నడపగా, ఈ ఏడాది మరో ఐదు బస్సులు పెంచి, మొత్తం 68 బస్సులను హైదరాబాద్ నుంచి నడిపింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రయాణికులపై అదనపు భారం పడకుండా సాధారణ టికెట్ ధరకే వీటిని నడిపింది. గత ఏడాది ప్రత్యేక బస్సుల ద్వారా రూ.51 లక్షల ఆదాయం రాగా, ఈసారి అంతకు మించి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తిరుగు ప్రయాణానికి 100 సర్వీసులు

సంక్రాంతి పండగ పూర్తయిన తరువాత ఈ నెల 16వ తేదీ నుంచి తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం జిల్లా నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాలకు నడిపేందుకు 100 ప్రత్యేక బస్సుల్ని సిద్ధం చేశారు. వీటికి ఈ నెల 11 నుంచే ఆన్‌లైన్ రిజర్వేషన్లు ప్రారంభమయ్యాయి. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి మరిన్ని బస్సులు ఏర్పాటు చేసేందుకు, వాటికి కూడా ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

రైళ్లలోనూ అదే రద్దీ

సంక్రాంతి పండగ సందర్భంగా రైళ్లలోనూ విపరీతమైన రద్దీ కొనసాగింది. జిల్లా మీదుగా నిత్యం రాకపోకలు సాగించే వాటితో పాటు సుమారు 12 సంక్రాంతి ప్రత్యేక రైళ్లు కూడా ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ నుంచి నిత్యం 30 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. పండగ సందర్భంగా మరో 10 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. దాదాపు ప్రతి రైలు బోగీ కిక్కిరిసిపోవడంతో గత్యంతరం లేక కొంతమంది ఫుట్ పాత్‌పై సైతం ప్రయాణిస్తూ గమ్యం చేరేందుకు సాహసిస్తున్నారు. పండగ సందడి అనంతరం తిరిగి వెళ్లే వారి కోసం కూడా రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. ఈ నెల 16, 17 తేదీల్లో కాకినాడ - సికింద్రాబాద్ - కాకినాడ (07254/07253), 16, 17, 18, 19, 29 తేదీల్లో సికింద్రాబాద్ - బరంపురం - సికింద్రాబాద్ (07025/07026) రైళ్లు నడుపుతోంది. పండగ ప్రయాణికులకు సహాయ పడేందుకు వీలుగా రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఇది ప్రయాణికులకు 24 గంటలూ అందుబాటులో ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు



సంక్రాంతి అనంతరం తిరుగు ప్రయాణమయ్యే వారికి సౌకర్యంగా ఉండే సమయాలను గుర్తించి, ప్రత్యేక బస్సులు సిద్ధం చేశాం. తెలంగాణకు మాత్రమే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు కూడా ఈ ప్రత్యేక బస్సులు నడుపుతాం. సంక్రాంతి పర్వదినాల్లో మా సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటూ సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా, వారికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా బస్సులు నడిపేందుకు చర్యలు చేపడుతున్నాం.

– షర్మిల అశోక, జిల్లా ప్రజా రవాణా అధికారి



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సందడి



పెట్టె, బ్యాగులు సర్దుకుని బస్సు కోసం వెయిటింగ్ : రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న ప్రయాణికులు



చలో కోనసీమ : అమలాపురం బస్సు వద్ద క్యూ కట్టిన ప్రయాణికులు

సుందరకాండతో రామాయణ పారాయణ ఫలం



షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహర్షి వాల్మీకి ప్రణీత రామాయణంలోని సుందర కాండ చదివినా, సంపూర్ణ రామాయణ పారాయణ ఫలితం లభిస్తుందని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. స్థానిక హిందూ సమాజంలో 32వ రోజైన శనివారం శ్రీరామాయణ ప్రవచన ధారను ఆయన శనివారం కొనసాగించారు. 'సీతాదేవి, హనుమంతుడు పరస్పరం రామకథను చెప్పుకున్నారు. రామతత్వాన్ని, రాముని మూర్తిని, గుణరూపాలను సీతాదేవికి హనుమంతుడు విన్నవించాడు. దీంతో ఆమెకు స్వస్థత చేకూరింది. 'నేను దశరథుని కోడలిని. రాముని ధర్మపత్నిని. నా పేరు సీత' అంటూ హనుమకు సీతమ్మ తల్లి పరిచయం చేసుకుంటుందని, ఇది భారతీయ స్త్రీ సంస్కారమని, ముందు మెట్టినిల్లు గురించి చెప్పాలని సామవేదం అన్నారు. 'నీ మాటలు వినక ముందు నేను జీవితం చాలించాలనుకున్నాను. నీ మాటలు విన్నాక, జీవితం మీద ఆశ కలిగింది' అని సీతాదేవి చెబుతుందని, మనిషి తనంత తాను జీవితాన్ని ముగించుకోరాదనే మహత్తర సందేశాన్ని రామాయణం ఇస్తోందని చెప్పారు. నేటి యువత నిరాశకు గురై, ఆత్మహత్య వంటి ఆలోచనలు చేయరాదన్నారు. రామాయణం విని ఆనందించే కథ కాదని, అధ్యయనం చేయవలసిన మహావిద్యని చెప్పారు. రాముని గురించి హనుమంతుడు చేసిన వర్ణనలో విష్ణు సహస్ర నామాల్లోని అనేక పేర్లు కనిపిస్తాయని తెలిపారు. రాముడు, కృష్ణుడు మంత్రాధిదేవతలని, అవతరించక ముందు నుంచే వారిని ఆరాధించిన వారు, ఎదురు చూసిన వారిలో శరభంగుడు, శబరి వంటి పలువురు ఉన్నారని వివరించారు. అన్ని వర్ణాల వారినీ రక్షించేవాడు రాముడని హనుమ అంటాడని, నిజమైన నాయకుడు తన వారినే కాకుండా, అందరినీ తన వారిగా భావించి, రక్షిస్తాడని అన్నారు. రాముడు ధర్మాన్ని పాటించడమే కాదు, ప్రజలు చేత పాటింపజేసే వాడని, బ్రహ్మచర్య దీక్ష కలవాడని హనుమ వివరిస్తాడని చెప్పారు. ఇక్కడ బ్రహ్మచర్యమంటే ఇంద్రియ నిగ్రహమనే అర్థమని అన్నారు. 'ఒక వానరం వచ్చి లంకను అగ్నికి ఆహుతి చేస్తాడని త్రిజట కన్న కలను కొందరు పిల్ల రాక్షసులు నమ్మకపోయి ఉండవచ్చును. అలా చేయాలంటే మళ్లీ వాలి రావాలి లేదా వానర రూపంలో శివుడే రావాలని వారు భావించారు. వచ్చిన వాడు రుద్రాంశ సంభూతుడనే విషయం ఆ పిల్ల రాక్షసులకు తెలియదు' అని సామవేదం చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న ఆవిష్కరించనున్నారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ తెలిపారు. విగ్రహంతో పాటు అంబేడ్కర్ స్మృతివనాన్ని కూడా సీఎం ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచీ కులమత రాజకీయాలకు అతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా సువిశాల ప్రదేశంలో సుమారు రూ.400 కోట్లతో 125 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఈక్వాలిటీ ఆఫ్ లిబర్టీగా ఏర్పాటు చేశారని వివరించారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కై లైటింగ్, ఫౌంటైన్లు, లైబ్రరీ వంటి వాటితో స్మృతివనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని చెప్పారు. 3 వేల మంది కూర్చునే వీలున్న మల్టీపర్పస్ కన్వెన్షన్ హాలు, 2 వేల మంది కూర్చునేందుకు వీలుగా ఓపెన్ థియేటర్, 10 వేల పుస్తకాలతో లైబ్రరీ ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని విక్టర్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.సందీప్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి, రాష్ట్ర జైభీమ్ సేన అధ్యక్షుడు కె.భానుచందర్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, దళిత మహిళా అధ్యక్షురాలు పి.బేబీ ప్రశాంతి పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

- ఎల్‌హెచ్‌ఎంఎస్ ఉపయోగించుకోండి
- ప్రజలకు ఎస్పీ జగదీష్ సూచన
- కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



ఎస్పీ పి.జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సంక్రాంతి పండగకు ఊరికి వెళ్తున్న వారు తమ ఇళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. దీని కోసం పోలీసులు అందించే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) వినియోగించుకోవాలని పేర్కొన్నారు. 94932 06371, 99084 54580 నంబర్లకు ఫోన్ చేస్తే, సిబ్బంది వచ్చి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఆయన సూచనలివీ..

- పండగ సెలవులకు దూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంట్లోని విలువైన ఆభరణాలు, వస్తువులను బ్యాంక్ లాకర్లలో ఉంచుకోవాలి.
- బయటి గేటును లోపల నుంచి లాక్ చేయాలన్నారు. వేసిన తాళం సాధ్యమైనంత వరకూ నేరస్తులకు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ప్రయాణ ప్రణాళికలను సోషల్ మీడియాలో లేదా ఇతరులకు వెల్లడించరాదు.
- నమ్మకస్తులైన వాచ్‌మన్ లేదా సెక్యూరిటీ గార్డులను మాత్రమే నియమించుకోవాలి.
- ఇంటి గుమ్మం ముందు చెత్త, పాల ప్యాకెట్లు, వార్తా పత్రికలు ఉంచరాదు.
- ద్విచక్ర వాహనాలను ఇంటి ఆవరణలోనే ఉంచుకోవాలి.
- అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా 100 నంబర్‌కు సమాచారం అందించాలి.

కోడిపందేల బరులపై పోలీసుల దాడులు



కోడిపందేల బరిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు నిర్వహిస్తున్న బరులను పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు బొమ్మూరు, త్రీటౌన్, కడియం, నల్లజర్ల, గోపాలపురం, కోరుకొండ, నిడదవోలు ప్రాంతాల్లో కోడిపందేల బరులపై పోలీసులు దాడులు చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందేలు, గుండాట, జూదం, అశ్లీల నృత్యాలను ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని, వీటిని అతిక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు. ఏ ఒక్కరూ ఎటువంటి జూద క్రీడలూ నిర్వహించరాదని కోడిపందేలను ప్రోత్సహించవద్దని విజ్ఞప్తి చేశారు. కోడిపందేల బరులకు స్థలాలు ఇచ్చినా, వాటిని నిర్వహించినా, పాల్గొన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో కోడిపందేలు నిర్వహించిన, ఆడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు.

టీడీపీ వస్తే రాష్ట్రం దివాళాయే..

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- రాజమహేంద్రి విశ్వనగరం కావాలన్నదే ఆకాంక్ష అని వెల్లడి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ఖజానాను పూర్తిగా దోచేసి, ప్రజలను నట్టేట ముంచిన టీడీపీ మళ్లీ వస్తే రాష్ట్రం దివాళా తీస్తుందని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబు వస్తే జాబు గ్యారెంటీ, మీ భవిష్యత్తుకు బాబు ష్యూరిటీ నినాదాలతోనే రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు వస్తే చినబాబు లోకేష్‌కు మంత్రి పదవి గ్యారంటీ అయిందే తప్ప నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 640 హామీలిచ్చి, గెలిచాక ముఖం చాటేశారని చెప్పారు. దీనికి భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయడమే కాకుండా, ఇంకా ఎక్కువ అభివృద్ధి పనులు చేసి, ప్రజాభిమానం చూరగొన్నారని అన్నారు. ఇప్పుడు మళ్లీ ఎలాగైనా అధికారం చేపట్టాలన్న ఉద్దేశంతో అమలు చేయలేని, ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలతో చంద్రబాబు వస్తున్నాడని, ఆయన మోసపూరిత వైఖరిని నమ్మడానికి ప్రజలేమీ అమాయకులు కారని, ఎక్కడికక్కడ నిలదీయడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ అందించిన సంక్షేమ పాలన, అభివృద్ధి వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తీసుకు రావడానికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. ప్రపంచ పటంలో రాజమహేంద్రవరం విశ్వ నగరంగా గుర్తింపు పొందాలన్నదే తన ఆకాంక్ష అని భరత్‌రామ్ చెప్పారు. ఈర్ష్య, అసూయతో లేనిపోని బురద జల్లుతారా అంటూ టీడీపీ, జనసేన నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరానికి మూడుసార్లు మేయర్లుగా టీడీపీ వారే ఉన్నారని, అలాగే ఎమ్మెల్యేలుగా కూడా వారే ఉన్నా ఏమాత్రం అభివృద్ధి చేయలేదని చెప్పారు. కేవలం రూ.400 కోట్లతో చేసిన అభివృద్ధిని చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగర అభివృద్ధే తన ఏకైక అజెండా అని, ఎవరెన్ని అనుకున్నా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతానని చెప్పారు. నగర అభివృద్ధిపై తనకు స్పష్టత ఉందని, త్వరలోనే మేనిఫెస్టో విడుదల చేస్తానని ఎంపీ భరత్‌రామ్ తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నేత డాక్టర్ గుడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

శృంగార వల్లభుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో వేంచేసిన స్వయంభూ శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారిని సుమారు 10 వేల మంది దర్శించుకున్నారని ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. దర్శనం టికెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.1,70,722 ఆదాయం సమకూరిందని చెప్పారు. భక్తులకు అన్నదానం చేశామన్నారు. చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ నారాయణమూర్తి ఆధ్వర్యాన ఆలయంలో ఏర్పాట్లు చేశారు.

విత్తుకు.. ముమ్మందుకు..

- డ్రమ్ సీడర్ విధానంతో ప్రయోజనాలు
- కూలీల సమస్యకు చెక్
- క్రమపద్ధతిలో నాట్లకు సరికొత్త మార్గం

రాజానగరం: వ్యవసాయ రంగం ఆధునీకత వైపు పరుగులు తీస్తుంది.. దీనిని అందిపుచ్చుకుంటే సాగు బంగారమే.. కొత్తగా వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకుంటే మంచి దిగుబడులు సాధించ వచ్చని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇందుకు గాను తాము రూపొందించి, వాడుకలోకి తెచ్చిన డ్రమ్ము సీడర్‌తో ఎంతగానో ప్రయోజనాలు ఉన్నాయని అంటున్నారు. మెట్ట ప్రాంతంలో వరి విత్తనాలు నాటే విధానానికి డ్రమ్ము సీడర్ అనుకూలమైంది. దీని వల్ల సమయం ఆదాతోపాటు కూలీ సమస్య ఉండదు. శ్రమ, ఖర్చు తగ్గుతాయి. ఈ సాధనాన్ని ఉపయోగించి వరి విత్తనాలను చల్లితే క్రమపద్ధతిలో వరి మొక్కలు రావడంతోపాటు దుబ్బు బాగా కట్టి, మంచి దిగుబడులు సాధించవచ్చు. డ్రమ్ము సీడర్‌తో మొలకెత్తిన వరి విత్తనాలను నేరుగా పొలాల్లో విత్తుకుంటే పంట త్వరగా రావడంతోపాటు ఉత్పత్తి వ్యయం కూడా తగ్గుతుందని, దిగుబడి 5 నుంచి 10 శాతం వరకూ పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. డ్రమ్ము సీడర్‌ని వినియోగించే విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా చూపిస్తున్నారు. గత 16 ఏళ్లుగా జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఈ పద్ధతిలో అనేక ప్రదర్శనా క్షేత్రాలను ఏర్పాటు చేసి వరి సాగులో మంచి ఫలితాలు సాధించారు.



డ్రమ్ము సీడర్‌తో విత్తనాలు చల్లే విధానాన్ని చూపిస్తున్న సీతానగరం మండల వ్యవసాయాధికారి కేఎస్ రమేష్

నీటి సమస్య అధిగమించొచ్చు

పొలంలో నేరుగా విత్తనాలు చల్లాలన్నా, మడులు కట్టి నారు పెంచాలన్నా పొలంలో సమృద్ధిగా నీరు ఉండాలి. అంతేకాక కూలీల అవసరం ఉంటోంది. ఈ సమస్యలను పూర్తిగా అధిగమించేందుకు పొలాల్లో నేరుగా డ్రమ్ము సీడర్‌తో వరి విత్తనాలను నాటుకోవచ్చు. ఈ పరికరం తయారు చేసే విధానాన్ని కూడా కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం సహాయకులు రైతులకు వివరిస్తున్నారు. మొలకెత్తిన విత్తనం వేసేందుకు వీలున్న నాలుగు ప్లాస్టిక్ డబ్బాలను కలిపి, ప్రతి డబ్బాకు 20 సెం.మీ. దూరంలో రంధ్రాలు

పాడి-పంట

చేయాలి. పరికరం సులువుగా కదలడానికి ఇరువైపులా రెండు పెద్ద చక్రాలు ఏర్పాటు చేయాలి. దానిని లాగడానికి అనువుగా హ్యాండిల్‌ను అమర్చుకోవాలి. ఇలా తయారు చేసిన తరువాత దీని బరువు 10 కిలోలను మించి ఉండదు. కొద్దిగా మొలకెత్తిన విత్తనాలను ఆ నాలుగు డబ్బాల్లో పోసి, దమ్ము చేసి, చదును చేసిన పొలాల్లో పెట్టి ముందుకు లాగడం ద్వారా విత్తనాలను నాటుకోవచ్చు. ఈ విధంగా చేయడం వల్ల ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనాలు సరిపోతాయి. ఇద్దరు మనుషులు మూడు గంటల్లో ఒక ఎకరం పొలంలో ఈ విధంగా విత్తనాలు విత్తేందుకు అవకాశం ఉంటుంది. ఈ విధానంలో మొక్కల పెరుగుదలతోపాటు కలుపు కూడా పెరిగే అవకాశం ఉన్నందున 15 నుంచి 20 రోజుల్లో కలుపు నివారణకు మందులను వాడాలని అధికారులు సూచించారు. అలాగే దమ్ములో 150 కిలోల సూపర్ ఫాస్ఫేట్‌తోపాటు 15 కిలోల పొటాష్ ఎరువును, విత్తిన 15 రోజులకు నత్రజని ఎరువును వేయాలని తెలిపారు.

క్లుప్తంగా

రంజీ జట్టులో సత్యనారాయణరాజు



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రా రంజీ క్రికెట్ జట్టులో కాకినాడకు చెందిన ఫాస్ట్ బౌలర్ సత్యనారాయణ రాజు స్థానం దక్కించుకున్నాడని క్రికెట్ సంఘ కార్యదర్శి పసుపులేటి సత్యనారాయణ శనివారం తెలిపారు. దీంతో జిల్లా క్రికెట్ సంఘం ఏడేళ్ల తరువాత అరుదైన ఘనత సాధించింది. 2023–24 సీజన్‌లో నిర్వహించే రంజీ ట్రోఫీలో ముంబై వర్సెస్ ఆంధ్రా మ్యాచ్‌లో సత్యనారాయణ రాజు ఫాస్ట్ బౌలర్‌గా ఆడనున్నారు. అతను సీఆర్ఎం కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. జిల్లా క్రికెట్ సంఘం స్థానిక ఆర్ఎంసీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణా కేంద్రంలో పదేళ్లగా తర్ఫీదు పొందుతున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజును క్రికెట్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్, కార్యదర్శి సత్యనారాయణ, కోచ్ ఇశ్రాయేల్ రాజు అభినందించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



అంబులెన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సామర్లకోట: స్థానిక రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ నుంచి ఓ వ్యక్తి వెళ్తూ సామర్లకోట రైల్వే ప్లాట్‌ఫామ్ దాటిన తరువాత గాంధీబొమ్మ ఎదురుగా ఉన్న పట్టాల వద్ద జారిపడ్డాడు. రైల్వే కీమెన్ సమాచారం మేరకు పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించక పోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోర్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తాళ్లరేవు: భార్యపై కోపంతో ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన ఘటన జార్జిపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్‌లో జరిగింది. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ కథనం ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన సవరపు నాగబాబు దంపతులు తరచూ గొడవలు పడుతుండేవారు. ఈ నేపథ్యంలో శనివారం ఇద్దరూ మాటామాటా అనుకోవడంతో అది కాస్తా తీవ్రరూపం దాల్చింది. తీవ్ర మనస్తాపం చెందిన నాగబాబు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

దైవదర్శనానికి వెళ్లొస్తుండగా ప్రమాదం



ప్రమాదానికి కారణమైన కారు

- కుమారుడి మృతి, తల్లికి తీవ్ర గాయాలు
- ప్రమాదం నుంచి బయటపడిన తండ్రి, మరో కుమారుడు



ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన గౌతమి



తమ్ముడి మృతితో ఘటనా స్థలంలో రోదిస్తున్న దుర్గాప్రసాద్

పిఠాపురం: వేగంగా వచ్చిన కారు ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.. ఒకరిని అనంతలోకాలకు తీసుకెళ్లగా, మరొకరిని తీవ్ర గాయాలపాల్జేసింది.. పండగ సెలవులు కావడంతో దైవ దర్శనానికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్న భార్యాభర్తలు, వారి ఇద్దరు కుమారులను కారు ఢీకొనడంతో కొడుకు మృతి చెందగా తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి, మరో కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన గొల్లప్రోలు వై.జంక్షన్ వద్ద శనివారం చోటుచేసుకుంది. ఎస్సై బాలాజీ కథనం ప్రకారం.. కోటనందూరు మండలం జగన్నాథనగరానికి చెందిన వ్యక్తులు తమ కారులో కాకినాడ వెళుతున్నారు. ఆ కారు గొల్లప్రోలు వై.జంక్షన్‌కు వచ్చేసరికి మోటారు సైకిల్‌పై అన్నవరం నుంచి తమ స్వగ్రామం వెళ్తున్న రామచంద్రపురం మండలం వెల్లకు చెందిన సీహెచ్ వెంకటరమణ, తన భార్య గౌతమి, కుమారులు దుర్గాప్రసాద్, శ్రీచైతన్యలను బలంగా ఢీకొంది. ఈ సంఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో వారి చిన్న కుమారుడు శ్రీచైతన్య (3) అక్కడికక్కడే మృతి చెందగా, తల్లి గౌతమికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్, తండ్రి వెంకటరమణ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న హైవే పోలీసులు గాయాలైన తల్లి గౌతమిని 108 అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వివరించారు. గొల్లప్రోలు ఎస్సై బాలాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనివాసా.. శ్రీవెంకటేశా



ఆలయంలో స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

- భక్తులతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం
- ఒక్క రోజే రూ.29 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: గోవిందా.. హరి గోవిందా.. గోకుల నందన గోవిందా నామస్మరణ వాడపల్లి క్షేత్రం వద్ద మార్మోగింది.. అశేష భక్తజనం ఆ స్వామిని కొలిచి తన్మయత్వం చెందింది.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి వివిధ పూజాదికాలు నిర్వహించారు. తొలుత భక్తులు గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు కొలిచారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ మేరకు ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా ఈ ఒక్కరోజు సుమారు రూ.29,67,065 ఆదాయం సమకూరిందని ఈఓ వివరించారు. ఈ నెల 14న ఆలయ ఆవరణలో గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.750 చెల్లించాలన్నారు. ఇందులో పాల్గొంటే పెళ్లి కాని యువతీ యువకులకు పెళ్లిళ్లు జరుగుతాయని భక్తుల నమ్మకం. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మండలంలోని ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి, ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లను త్రిశూల రూపంలో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేకాలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామివారు

సెబ్ బృందానికి ఎస్పీ ప్రశంస



ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: వాకలపూడిలో శుక్రవారం 605 లీటర్ల సారాను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సెబ్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరరావుతో సహా బృందాన్ని కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శనివారం అభినందించారు. ఈ మేరకు శనివారం కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయంలో సత్కరించారు. సారా రవాణా, విక్రయాలు అధికంగా ఉండేందుకు ఆస్కారం ఉన్న సంక్రాంతి వేళ భారీ మొత్తంలో సారాను పట్టుకోవడంలో వెంకటేశ్వరరావు, ఆయన బృందం ఎంతో కృషి చేసిందని ఎస్పీ అభినందించారు. ఏ మాత్రం అనుమానం రాకుండా ఇంట్లో దాచిన సారా ప్యాకెట్లను గుర్తించడంలో చాకచక్యంగా వ్యవహరించారన్నారు. ప్రశంస పొందిన వారిలో వెంకటేశ్వరరావుతో సహా హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి వెండి పాదుకల సమర్పణ



బాబా ఆలయ గురువు రామారావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి బాబా ఆలయ గురువు మామిడిపల్లి రామారావు స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి వెండి పాదుకలను శనివారం సమర్పించారు. సుమారు 2 కేజీల వెండితో తయారు చేయించిన ఈ పాదుకల విలువ రూ.1.50 లక్షలు ఉంటుంది. బాబా ఆలయం నుంచి ఊరేగింపుగా భక్తులు వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. వీరికి ఆలయ ధర్మకర్త అనంతాత్ముల బాలాజీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాబా ఆలయ గురువు మామిడిపల్లి రామారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాబా ఆలయ కమిటీ చైర్మన్ కంటే నాగేశ్వరరావు, ఆయన సతీమణి విజయభార్గవి, కమిటీ సభ్యులు కంటే సత్యచక్ర గణపతి, గూడపాటి పెద్ద, బుడ్డిగ వీరపండు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి 'కియా సోనెట్ ద వైల్డ్ రిబోర్న్'



కియో సోనెట్ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న సంస్థ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు తదితరులు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): సరికొత్త కారు కియా సోనెట్ ద వైల్డ్ రిబోర్న్‌ని రాజమహేంద్రవరం, కాకినాడ కంటిపూడి కియా షోరూమ్‌లలో సంస్థ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు శనివారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా జీఎం కామేష్ మాట్లాడుతూ కియా సోనెట్‌ని ఆరు ఎయిర్ బ్యాగ్స్ స్టాండర్డ్, రోబోస్ 15 స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్స్‌తో రూపొందించారన్నారు. అడ్వాన్స్ ఏడీఏఎస్ 10 అటోనమస్ ఫీచర్స్, ఫ్యూచరిస్టిక్ డిజిటల్ స్క్రీన్ అండ్ క్లస్టర్, స్మార్ట్ ఎయిర్ ప్యూరిఫైర్, 360 డిగ్రీల కెమెరా, అత్యాధునిక స్మార్ట్ టెక్ 70 కియా కనెక్ట్ ఫీచర్స్ వంటి వాటితో పాటు పెట్రోలు, డీజిల్ వెరియోంట్‌లలో 5 ట్రాన్స్‌మిషన్స్‌తో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కారు ప్రారంభ ధర రూ.7,99,000 అని, బుకింగ్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కంటిపూడి గ్రూప్ డైరెక్టర్లు కె.వినయబాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణ , కె.మన్మోహన్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



బాస్కెట్ బాల్ పోటీలో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

రామచంద్రపురం: సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఓపెన్ కేటగిరీలో జరుగుతున్న 13వ పురుషుల, మహిళల జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు శనివారం హోరాహోరీగా సాగాయి. లీగ్ కం నాకవుట్ విధానంలో నిర్వహిస్తున్న ఈ పోటీలో తొలి రోజు లీగ్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో రామచంద్రపురం-ఏ జట్టు ఖమ్మం జట్టుపై 75–47, అట్లరీ జట్టు సామర్లకోటపై 45–22, హైదరాబాద్ డీబీఏ జట్టు జి.మామిడాడపై 55–48, సీ టాక్స్ ఎక్సైజ్ జట్టు ఏపీఎస్‌పీ కాకినాడపై 60–42, డీఎస్ఏ కాకినాడ జట్టు హైదరాబాద్ సెయింట్‌పై 53–42, సీబీఏ రాజమహేంద్రవరం జట్టు రామచంద్రపురం బీ జట్టుపై 44–23, అనంతపురం జట్టు సామర్లకోటపై 32–20 పాయింట్లతో విజయం సాధించాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.చక్రవర్తి వెల్లడించారు. కాగా మహిళల విభాగంలో హైదరాబాద్ డిఫెన్స్ జట్టు కాకినాడ డీఎస్ఏపై 41–10, విజయవాడ సీబీఏ స్టెల్లా జట్టు అమలాపురంపై 26–10, రామచంద్రపురం జట్టు అమలాపురంపై 45–07, హైదరాబాద్ డీబీఏ జట్టు విజయవాడ స్టెల్లాపై 31–08, ఏలూరు జట్టు డీఎస్ఏ కాకినాడపై 29–04 పాయింట్లతో విజయం సాధించారని తెలిపారు. రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్, రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు అధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్, ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్టోస్ అధినేత అడ్డూరి జగన్నాథవర్మ తదితరులు హాజరయ్యారు.

19న పీఠాధిపతి గాడ్ జన్మదిన వేడుకలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) 88వ జన్మదిన వేడుకలను ఈ నెల 19న పీఠంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి) శనివారం పీఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నెల 17 ఉదయం 9.45 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో జన్మదిన వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. భక్తజన సంక్షోభ నివారణార్థం పీఠంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

17 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు

గాడ్ జన్మదిన వేడుకల్లో భాగంగా 17 ఉదయం వైఖానస పండితులచే సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తారు. 18 ఉదయం 10 గంటలకు టీటీడీ వైఖానస పండితులచే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవిజయ వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణం, సాయంత్రం ఆరు గంటలకు విజయదుర్గాదేవికి 108 ప్రత్యేక హారతులు ఇస్తారు. సాయంత్రం ఆరు గంటలకు కాశీవిశ్వేశ్వరునికి కాశీ ఆలయ అర్చకులచే అభిషేకం, అర్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. 19న ఉదయం 10గంటల నుంచి గాడ్ జన్మదిన వేడుకలు ప్రారంభిస్తామన్నారు. జన్మదిన వేడుకలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.కిరణ్మయి, షెడ్యూల్ కులాల కమిషన్ సెక్రటరీ కె.హర్షవర్ధన్ తదితర ప్రముఖులతో పాటుగా, తిరుమల శ్రీవారి సన్నిధి ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు, మహాసహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.



గాడ్ సమక్షంలో జన్మదిన వేడుకల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, భాస్కరనారాయణ తదితరులు

పసందుగా వందుకోండి

- మాంసం 'కోస'మే తాపత్రయం
- పందేల వద్ద ఎందరో పడిగాపులు

పిఠాపురం: సంక్రాంతికి కత్తులతో కాలుదువ్వే కోడి పందేలు జరగకుండా కట్టడి చేసేందుకు పోలీసు యంత్రాంగం చూస్తుంటే, వీటిని ఏదోలా జరపాలని నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. పందేలు చూసేందుకు కొంతమంది ఉవ్విళ్లూరుతుంటే.. ఇంకొందరు పసందైన పందెం కోడిని ఆరగించేందుకు తాపత్రయ పడుతుంటారు.. ఏనుగు చచ్చినా వెయ్యే బతికినా వెయ్యే అనేది సామెతే అయినా ఏనుగుకు అంత విలువ ఉంటుందో లేదో తెలీదుగాని పందెం కోడి మాత్రం చచ్చినా బతికినా రూ.వేల ఖరీదే. చచ్చే వరకూ పోరాడి తమ యజమానికి రూ.లక్షల్లో ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఈ కోడి చనిపోయిన తరువాత కూడా జేబు నింపుతోంది. పందెంలో ఓడి చనిపోయిన కోడికి బతికున్న దానికుంటే విలువ ఎక్కువ. దానినే 'కోస' అంటారు. దీనికోసం ఆరాటపడని వారు ఎవరూ ఉండరంటే అతిశయోక్తికాదు. కోస మాంసానికి మంచి గిరాకీ ఉంటుంది. పందెం రాయుళ్ల కంటే కోసలను కాల్చి మాంసం తయారు చేసేవాళ్లు చేతినిండా సంపాదించుకున్నారంటే కోసల విలువ ఎంత ఉంటుందో అర్థమవుతుంది. ప్రతి కోడిపందేల బరి వద్ద కోసలను కాల్చి మాంసం నరికే దుకాణాలు వెలిశాయి. సోమవారం జరిగే పందేల్లో వందల కోళ్లు పందెంలో ఓడిపోనుండగా, కోస మాంసం ప్రియులకు చేరనుంది. ఇది కిలో రూ.500 నుంచి రూ. వెయ్యి వరకూ ఉంటోంది. ఇది కొవ్వు లేకుండా రుచిగా, బలవర్ధకంగా ఉండడంతో ఎక్కువ మంది తినేందుకు ఇష్టపడతారు. పందెం కోళ్లను కొన్ని నెలలు బాదం, పిస్తా, జీడిపప్పు వంటి ఆహారంతో పాటు రోజూ వ్యాయామం చేయిస్తూ పెంచడం వల్ల కండలు తేరి కొవ్వు లేకుండా మాంసం రుచిగా ఉంటుంది. అందుకే పందేలకు కోస కోసం వెళ్లేవారూ అధికంగా ఉంటారు.





రన్నరప్‌గా బోపన్న జోడి

కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించాలనుకున్న భారత వెటరన్ టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశే ఎదురైంది. అడిలైడ్ ఇంటర్నేషనల్ ఏటీపీ -250 టోర్నీలో బోపన్న - మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడి రన్నరప్‌గా సరిపెట్టుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో మూడో సీడ్ రాజీవ్ రామ్ (అమెరికా) - జో సాలిస్‌బరీ ద్వయం 7-5, 5-7, 11-9తో రెండో సీడ్ బోపన్న - ఎబ్డెన్‌పై విజయం సాధించింది. బోపన్న జంట 12 ఏస్‌లు సంధించినా లాభం లేకపోయింది. తొలి సెట్‌లో ఒక దశలో 4-0తో ఆధిక్యంలో ఉండి కూడా బోపన్న టీమ్ దానిని చేజార్చుకుంది. రెండో సెట్‌లో స్కోరు 5-5తో సమంగా ఉన్న సమయంలో ప్రత్యర్థి గేమ్‌ను బ్రేక్ చేసి ముందంజ వేసిన రోహన్ - ఎబ్డెన్ ఆ తర్వాత సెట్‌ను గెలుచుకున్నారు. మూడో సెట్ టైబ్రేకర్‌తో చివరకు రాజీవ్ - సాలిస్‌బరీదే పైచేయి అయింది. ఒక గంటా 38 నిమిషాల పాటు సాగిన ఈ హోరాహోరీ పోరులో 5 డబుల్ ఫాల్ట్‌లు చేసి కూడా ఈ జంట గట్టెక్కింది.

ఆరు గేమ్ పాయింట్లు కాపాడుకొని...



- ఫైనల్లో సాత్విక్ - చిరాగ్ జోడి
- మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్

కౌలాలంపూర్: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ వేదికపై మరో టైటిల్ సాధించేందుకు భారత ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి అడుగు దూరంలో నిలిచారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ -1000 టోర్నీ మలేసియా ఓపెన్‌లో ఈ జోడి ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఆరు గేమ్ పాయింట్లు కాపాడుకోవడంతో పాటు ఆపై మరో రెండు పాయింట్లు గెలుచుకొని విజయాన్ని సొంతం చేసుకుంది. రెండో సీడ్ సాత్విక్ - చిరాగ్ 21-18, 22-20 స్కోరుతో ఆరో సీడ్, కొరియాకు చెందిన కాంగ్ మిన్ హ్యూక్ - సియో స్యూంగ్ జాను చిత్తు చేశారు. 47 నిమిషాల పాటు సాగిన మ్యాచ్ సాగింది.

తొలి గేమ్ ఆరంభంలో భారత ఆటగాళ్ల ఆధిక్యం సాగింది. చక్కటి ర్యాలీలతో వీరిద్దరు 9-5తో ముందంజ వేయగా వరుసగా నాలుగు పాయింట్లతో కొరియా ద్వయం స్కోరును సమం చేసింది. అయితే 11-9తో, ఆపై 13-12తో మన జట్టు ఆధిక్యం ప్రదర్శించింది. వరుస పాయింట్లతో 17-13 వరకు దూసుకెళ్లిన చిరాగ్ - సాత్విక్ దానిని కొనసాగించారు. రెండో గేమ్ మాత్రం హోరాహోరీగా సాగింది. అనంతరం 9-4తో...11-6తో ఆధిక్యం చూపించిన కొరియా ఆటగాళ్లు ఒక దశలో 17-11తో గేమ్‌పై పట్టు బిగించారు. ఈ సమయంలో భారత్ కోలుకునే ప్రయత్నం చేసినా 20-14తో గేమ్ గెలిచే స్థితికి కొరియా చేరింది. అయితే ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. ఒకటి కాదు రెండు కాదు...వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించిన సాత్విక్ - చిరాగ్ సంచలనం సృష్టించారు. నేడు జరిగే ఫైనల్లో చైనాకు చెందిన టాప్ సీడ్ జంట లియాంగ్ వి కెంగ్ - వాంగ్ చాంగ్‌తో సాత్విక్ - చిరాగ్ తలపడతారు. గతంలో ఈ రెండు జోడీల మధ్య 4 మ్యాచ్‌ల జరగ్గా...భారత ద్వయం 1 మ్యాచ్‌లో గెలిచి 3 మ్యాచ్‌లలో ఓడింది.



రోహిత్, దూబే

సిరీస్ గెలిచే లక్ష్యంతో...

- నేడు భారత్, అఫ్గనిస్తాన్ రెండో టి20
- బరిలోకి దిగనున్న విరాట్ కోహ్లి
- రా.7 గం.నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ఇండోర్: బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన పిచ్, వేగవంతమైన అవుట్‌ఫీల్డ్, చిన్న బౌండరీలు...ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో పరుగుల వరదకు రంగం సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు ఇక్కడ జరిగే రెండో టి20 మ్యాచ్‌లో భారత్, అఫ్గనిస్తాన్ తలపడనున్నాయి. తొలి మ్యాచ్‌ను గెలిచి 1-0తో ముందంజలో ఉన్న భారత్ ఈ మ్యాచ్‌నూ సొంతం చేసుకొని సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని భావిస్తోంది.

భారత తుది జట్టులో స్వల్ప మార్పులు జరగనున్నాయి. గత మ్యాచ్ ఆడని విరాట్ కోహ్లి ఇప్పుడు బరిలోకి దిగుతున్నాడు. మరో 35 పరుగులు చేస్తే కోహ్లి టి20 క్రికెట్‌లో 12 వేల పరుగులు పూర్తి చేసుకున్న తొలి భారత ఆటగాడిగా నిలుస్తాడు. కోహ్లి రాకతో గిల్‌ను పక్కన పెట్టడం ఖాయం. అయితే ఓపెనర్ యశస్వి గాయంనుంచి కోలుకుంటే జట్టులోకి వస్తాడు. లేదంటే గిల్‌కు మరో అవకాశం దక్కుతుంది. బౌలింగ్‌లో కూడా లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌కు బదులుగా కుల్దీప్ యాదవ్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. పేస్ విభాగంలోనూ మార్పు అవసరం అనుకుంటే ముకేశ్‌ను పక్కన పెట్టి టీమ్ మేనేజ్‌మెంట్ అవేశ్‌కు చాన్స్ ఇవ్వవచ్చు. మరో వైపు అఫ్గనిస్తాన్ మరో సారి తమ స్పిన్‌నే బలంగా నమ్ముకుంటోంది. ముజీబ్, నబీలు కొనసాగనుండగా ముగ్గురు పేసర్లు ఫజల్, నవీన్, గుల్బదిన్‌లు భారత్ బలమైన బ్యాటింగ్ లైనప్‌ను ఎంత వరకు నిలువరిస్తారనేది చూడాలి. మిడిలార్డర్‌లో రహ్మత్ స్థానంలో దూకుడైన బ్యాటర్ అయిన హజ్రతుల్లా జట్టులోకి వస్తాడు. సంచలన ప్రదర్శనతో సిరీస్‌ను సమం చేయాలని అఫ్గన్ జట్టు భావిస్తోంది.

భారత్ పరాజయం



రాంచీ: మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీని భారత జట్టు ఓటమితో మొదలు పెట్టింది. శనివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 0-1 తేడాతో అమెరికా చేతిలో పరాజయంపాలైంది. అమెరికా తరఫున 16వ నిమిషంలో తామెర్ అబిగైల్ ఏకైక గోల్ నమోదు చేసింది. తొలి క్వార్టర్ హోరాహోరీ సాగి ఒక్క గోల్ కూడా నమోదు కాకపోగా, రెండో క్వార్టర్ ఆరంభంలోనే యూఎస్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత భారత మహిళలు ఎన్ని ప్రయత్నాలు చేసినా స్కోరును సమం చేయలేకపోయారు. దురదృష్టవశాత్తూ ఆరు పెనాల్టీ అవకాశాలు వచ్చినా... ఒక్కదానిని కూడా గోల్‌గా మలచలేక భారత్ వృథా చేసుకుంది. నేడు జరిగే తమ తర్వాతి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది.

ఆసీస్ చేతిలో భారత్ ఓటమి

ఆసియాన్ కప్ ఫుట్‌బాల్



ఇర్విన్

దోహా (ఖతర్): ఆసియాన్ కప్ ఫుట్‌బాల్ టోర్నీని భారత జట్టు పరాజయంతో ప్రారంభించింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 2-0 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. ఆసీస్ తరఫున 50వ నిమిషంలో జాక్సన్ ఇర్విన్, 73వ నిమిషంలో జోర్డాన్ బాస్ గోల్స్ సాధించారు. ఆసీస్ ఆటను దూకుడుగా ప్రారంభించింది. ఆరంభంలోనే అజీజ్ బెహిచ్ కొట్టిన షాట్ గోల్ పోస్ట్‌కు దూరంగా వెళ్లిపోగా, గుడ్‌విన్ ఇచ్చిన ఫ్రీకిక్‌ను హెడర్‌తో గోల్ చేయడంలో డ్యూక్ విఫలమయ్యాడు. 16వ నిమిషంలో భారత్‌కు గోల్ చేసేందుకు మంచి అవకాశం లభించింది. నిఖిల్ పుజారి క్రాసింగ్ పాస్ అందించగా, కెప్టెన్ సునీల్ ఛెత్రి దానిని గోల్‌గా మలచడంలో విఫలమయ్యాడు. తొలి అర్ధ భాగంలో ఆసీస్‌ను నిలువరించడంలో భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సఫలమయ్యాడు. తమకు లభించిన 11 కార్నర్ కిక్‌లలో ఆసీస్ సఫలం కాలేదు. అయితే రెండో అర్ధభాగం ప్రారంభమైన కొద్ది సేపటికే ఆస్ట్రేలియా పైచేయి సాధించింది. మార్టిన్ బాయెల్ కొట్టిన షాట్‌ను గుర్‌ప్రీత్ ఆపగలిగినా...అక్కడే ఉన్న ఇర్విన్ దానిని గోల్‌గా మలిచాడు. 69వ నిమిషంలో కూడా గోల్ చేసేందుకు చేరువైన భారత్ మళ్లీ విఫలమైంది. స్కోరు సమం చేసేందుకు ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. కొద్ది సేపటికే సుభాశిష్ బోస్‌ను తప్పించి ర్యాన్ మెక్‌గ్రీ బంతితో దూసుకెళ్లగా...పోస్ట్‌కు దగ్గరలోనే ఉన్న బాస్ దానిని అందుకొని సునాయాసంగా గోల్ సాధించాడు. తమ తర్వాతి మ్యాచ్‌లో గురువారం ఉజ్బెకిస్తాన్‌తో తలపడుతుంది.

హైదరాబాద్ ఘన విజయం

ఇన్నింగ్స్, 81 పరుగులతో మేఘాలయ చిత్తు



మిలింద్

షిల్లాంగ్: రంజీ ట్రోఫీ 'ప్లేట్' గ్రూప్‌లో హైదరాబాద్‌లో వరుసగా రెండో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. గత మ్యాచ్‌లాగే ఈ సారి కూడా రెండు రోజుల్లోనే ముగిసిన పోరులో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్, 81 పరుగుల తేడాతో మేఘాలయాను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 182/4తో శనివారం ఆట కొనసాగించిన హైదరాబాద్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 7 వికెట్ల నష్టానికి 346 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. రోహిత్ రాయుడు (216 బంతుల్లో 124 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకోగా, దూకుడుగా ఆడిన సీవీ మిలింద్ (38 బంతుల్లో 50 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించాడు. హైదరాబాద్‌కు 235 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం మేఘాలయ తమ రెండో ఇన్నింగ్స్‌లో 36.1 ఓవర్లలో 154 పరుగులకే కుప్పకూలింది. జస్కిరత్ సింగ్ (53), కిషన్ లింగ్డో (47) రాణించారు. తనయ్ త్యాగరాజన్ 3 వికెట్లు పడగొట్టగా...రవితేజ, మిలింద్ చెరో 2 వికెట్లు తీశారు.

ఆంధ్ర 98/3

ముంబై: 'ఎలైట్' డివిజన్‌లో భాగంగా ముంబైతో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర తడబడింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తమ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 98 పరుగులు చేసింది. జ్ఞానేశ్వర్ (23), విహారి (6), షేక్ రషీద్ (3) వెనుదిరగ్గా...ప్రశాంత్ కుమార్ (59 నాటౌట్), రికీ భుయ్ (4 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు. అంతకు ముందు 281/6తో ఆట కొనసాగించిన ముంబై తమ మొదటి ఇన్నింగ్స్‌లో 395 పరుగులకు ఆలౌటైంది. తనుష్ కొటియన్ (54), మోహిత్ అవస్థి (53) అర్ధ సెంచరీలు చేశారు. ఆంధ్ర బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి 5 వికెట్లు పడగొట్టగా...షోయబ్, లలిత్ చెరో 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం ఆంధ్ర మరో 297 పరుగులు వెనుకబడి ఉంది.

ఒలింపిక్ బెర్త్ నంబర్ 17



- షూటర్ విజయ్‌వీర్‌కు రజతం
- ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్

జకార్తా: పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ విభాగంలో భారత్‌నుంచి మరో బెర్త్ ఖాయమైంది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ ఈవెంట్‌లో విజయ్‌వీర్ సిద్ధూ ఈ కోటాను ఖాయం చేశాడు. దీంతో భారత్ నుంచి పాల్గొనే షూటర్ల సంఖ్య 17కు పెరిగింది. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీలో విజయ్‌వీర్ శనివారం రజత పతకం గెలుచుకున్నాడు. అయితే పతకం గెలుచుకోవడానికి ముందే అతనికి ఒలింపిక్ బెర్త్ ఖాయమైంది. క్వాలిఫయింగ్ దశలో 577 పాయింట్లు సాధించిన విజయ్‌వీర్ నాలుగో స్థానంలో నిలిచాడు. ఫైనల్‌కు చేరిన ఆరు గురిలో నలుగురికి ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశం ఉండగా అతనికి ఈ చాన్స్ లభించింది. చండీగఢ్‌కు చెందిన 21 ఏళ్ల వీర్ గత ఏడాది హాంగ్జూ ఆసియా క్రీడల్లో కాంస్యం సాధించాడు. మరో వైపు మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు 2 పతకాలు లభించాయి. ఈ ఈవెంట్‌లో సిఫ్ట్‌కౌర్ రజతం గెలుచుకోగా, ఆషి చౌక్సీకి కాంస్యం దక్కింది.

జైపూర్ పాంథర్స్ గెలుపు


జైపూర్: సొంతగడ్డపై జైపూర్ పింక్ పాంథర్స్ వరుసగా రెండో విజయంతో సత్తా చాటింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 36-34 స్కోరుతో పుణేరీ పల్టన్‌ను ఓడించింది. జైపూర్ తరఫున కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 16 పాయింట్లతో చెలరేగాడు. పుణేరీ ఆటగాళ్లలో కెప్టెన్ అస్లామ్ ముస్తఫా 8 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	12	10	2	0	52
జైపూర్ పింక్ పాంథర్స్	12	8	2	2	48
దబంగ్ ఢిల్లీ	11	7	3	1	40
గుజరాత్ జెయింట్స్	12	7	5	0	39
యు ముంబా	11	6	4	1	35
హరియాణా స్టీలర్స్	11	6	4	1	34
బెంగళూరు బుల్స్	12	5	7	0	31
పట్నా పైరేట్స్	11	5	6	0	29
బెంగాల్ వారియర్స్	11	4	5	2	28
యూపీ యోధాస్	12	3	8	1	21
తమిళ్ తలైవాస్	11	3	8	0	19
తెలుగు టైటాన్స్	12	1	11	0	10

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

సినిమా



లోహ్రీ రోజు దానం చేయాలి

- అమితాబ్ బచ్చన్

సంక్రాంతి పండగ సంబరాలు ఆరంభమయ్యాయి. కొందరు బాలీవుడ్ స్టార్స్ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

''అందరికీ లోహ్రీ (భోగి పండగ) శుభాకాంక్షలు. లోహ్రీ అంటే నాకు చాలా విషయాలు గుర్తుకొస్తాయి. లోహ్రీ రోజు జానపద కళాకారులు 'లోహ్రీ దా టక్కా దే, రబ్ యానూ బచ్చా దే' అంటూ పాటలు పాడుకుంటూ ఇంటింటికీ వచ్చినప్పుడు వారికి దానం ఇవ్వడం ఆనవాయితీ. నా చిన్నప్పుడు మా అమ్మగారు ఇలా పండగ తాలూకు విషయాలు చెప్పేవారు'' అని సోషల్ మీడియా ద్వారా అమితాబ్ బచ్చన్ షేర్ చేశారు. ''లోహ్రీ తాలూకు వెచ్చదనాన్ని, పండగ సందర్భంగా మా అమ్మగారు చేసిన స్వీట్స్‌ని తలుచుకుంటున్నాను. ఇరుగు పొరుగుతో పంచుకున్న నవ్వులతో నా మనసు నిండిపోయేది. నేటి బిజీ జీవితంలో అప్పటి ఆనందకర సాధారణ రోజులను తలచుకుని, ఆనందిస్తున్నాను. అందరి జీవితాల్లో లోహ్రీ ఆనందం నింపాలని కోరుకుంటున్నా'' అని సన్నీ డియోల్ పేర్కొన్నారు. ఇంకా అక్షయ్ కుమార్, సంజయ్ దత్, విక్కీ కౌశల్, ఇషా డియోల్, నేహా ధూపియా వంటి తారలు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.



సన్నీ డియోల్



అల్లు అర్జున్

టార్గెట్ ఫిక్స్

టార్గెట్ ఫిక్స్ చేశాడు పుష్పరాజ్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కలయికలో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప'. ఈ సినిమా తొలి భాగం 'పుష్ప: రైజ్' ఘనవిజయం సాధించడంతో, మలి భాగం 'పుష్ప: ది రూల్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్. యాభై శాతానికి పైగా సినిమా పూర్తయింది. బ్యాలెన్స్ షూటింగ్‌ను మే నెలాఖరుకల్లా పూర్తి చేసేలా టార్గెట్ ఫిక్స్ చేసుకుని, అందుకు అనుగుణంగా సుకుమార్ షూటింగ్ ప్లాన్ సిద్ధం చేశారని సమాచారం. వీలైనంత త్వరగా షూటింగ్ పూర్తి చేసి, ఈ సినిమా వీఎఫ్ఎక్స్, ఎడిటింగ్ వర్క్స్‌పై మరింత ఫోకస్ పెట్టాలని సుకుమార్ భావిస్తున్నారట. 'పుష్ప' సినిమాలో పుష్పరాజ్ పాత్రలో నటిస్తున్న అల్లు అర్జున్‌కు జోడీగా శ్రీవల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. ఫాహద్ ఫాజిల్, జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.

బాగుండే ఏ సినిమానీ ఎవరూ ఆపలేరు

- నిర్మాత 'దిల్' రాజు

''ఇండస్ట్రీలో ఎవరికి ఎవరూ శత్రువులు కాదు.. మిత్రులు కాదు. సినిమా అంటే వ్యాపారం. వ్యాపార కోణంలో కొన్ని సమీకరణాలు ఉంటాయి. ప్రతి సంక్రాంతికి మా మధ్య వార్స్ జరగడం సాధారణమే. అయితే బాగుండే ఏ సినిమానీ ఎవరూ ఆపలేరు'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. మహేశ్‌బాబు హీరోగా నటించిన చిత్రం 'గుంటూరు కారం'. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి, రమ్యకృష్ణ, ప్రకాశ్‌రాజ్, జయరాం కీలక పాత్రలు పోషించారు. సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన ఈ సినిమా విలేకర్ల సమావేశంలో నిర్మాత, పంపిణీదారుడు 'దిల్' రాజు మాట్లాడుతూ- ''గుంటూరు కారం' నైట్ షోలకు కాస్త నెగటివ్ టాక్ వచ్చింది. కానీ షో బై షో పాజిటివ్‌గా మారుతోంది. సినిమాలో మహేశ్‌బాబుగారి క్యారెక్టరైజేషన్ బాగుంది. తల్లీకొడుకుల ఎమోషనల్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'గుంటూరు కారం'. నేను థియేటర్‌లో సినిమా చూశాను. ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. 'బాగోలేదంట' అనే టాక్ విని ప్రేక్షకులు ఆ సినిమాకు వెళ్లి, చూసిన తర్వాత అవి బ్లాక్‌బస్టర్స్ అయిన సినిమాలు కొన్ని ఉన్నాయి. ఓ సినిమాకు ఉన్న నెగటివ్ టాక్స్ కలెక్షన్స్ చూసిన తర్వాతే పోతాయి. ఫైనల్ నంబర్స్‌ని పండగ తర్వాత చెబుతాం'' అన్నారు. ''ఈ పండక్కి ఫ్యామిలీతో కలిసి థియేటర్స్‌లో 'గుంటూరు కారం' చూడండి. ప్రేక్షకులు ఎంటర్‌టైన్ అవుతారన్న గ్యారంటీ నాది'' అన్నారు సూర్యదేవర నాగవంశీ.



నాగవంశీ, 'దిల్' రాజు

ఆస్కార్ లైబ్రరీలో జోరమ్

హిందీ చిత్రం 'జోరమ్' చరిత్ర సృష్టించింది. ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్ లైబ్రరీలో ఈ సినిమాకు చోటు దక్కింది. దేవాశిష్ మఖిజా దర్శకత్వంలో మనోజ్ బాజ్‌పాయ్, మొహమ్మద్ జీషన్ అయ్యూబ్, తన్నిష్ఠ ఛటర్జీ ప్రధాన పాత్రధారులుగా ఈ సినిమా రూపొందింది. జీ స్టూడియోస్, మఖిజా ఫిలింస్ ఈ సినిమాను నిర్మించాయి. గత ఏడాది ఫిబ్రవరిలో జరిగిన రోటర్‌డామ్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, జూన్‌లో సిడ్నీ ఫిల్మ్ ఫెస్టివల్, జూలైలో దర్బన్ ఫిల్మ్ ఫెస్టివల్, అక్టోబరులో 28వ బూసాన్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, 59వ చికాగో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమా ప్రదర్శితమైంది. థియేటర్స్‌లో గత ఏడాది డిసెంబరు 8న విడుదలైంది. ఈ సినిమాకు విమర్శకుల ప్రశంసలు దక్కినప్పటికీ బాక్సాఫీస్ వద్ద మాత్రం మెరుగైన ఫలితం దక్కలేదు. అయితే తాజాగా ఈ సినిమా వందేళ్ల చరిత్ర ఉన్న ఆస్కార్ లైబ్రరీలో చోటు దక్కించుకుంది. ఈ విషయాన్ని 'ఎక్స్'లో షేర్ చేశారు మనోజ్ బాజ్‌పాయ్. ''నా చిత్రానికి ఇలాంటి గౌరవం దక్కడం సంతోషంగా ఉంది. ఇది యూనిట్ సమష్టి విజయం. మనం ఎంత చేయగలమో మనకే తెలుసు'' అని పేర్కొన్నారు మనోజ్. ఇక ఈ చిత్రకథ విషయానికి వస్తే.. తన కుమార్తె ప్రాణాలను కాపాడటం కోసం ఓ తండ్రి చేసే పోరాటం నేపథ్యంలో సాగే సర్వైవల్ డ్రామాగా 'జోరమ్' తెరకెక్కింది. 2016లో 'తాండవ్' షార్ట్ ఫిల్మ్, 2020 జూన్‌లో 'భోంస్లే' (ఇండియా రిలీజ్) చిత్రాల తర్వాత హీరో మనోజ్ బాజ్‌పాయ్, దర్శకుడు దేవాశిష్ మఖిజా కాంబినేషన్‌లో రూపొందిన మూడో చిత్రం 'జోరమ్'.



'జోరమ్'లో మనోజ్ బాజ్‌పాయ్



ఆలియా భట్



జాన్వీ కపూర్

ఆలియా అవుట్.. జాన్వీ ఇన్?

హిందీలో 'దుల్హనియా' ఫ్రాంచైజీలో వచ్చిన 'హంప్టీ శర్మా కీ దుల్హనియా', 'బద్రీనాథ్ కీ దుల్హనియా' చిత్రాల్లో వరుణ్ ధావన్, ఆలియా భట్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాలకు శశాంక్ కేతన్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ ఫ్రాంచైజీలో మూడో భాగానికి కేతన్ ప్రయత్నాలు మొదలు పెట్టారని బాలీవుడ్ సమాచారం. వరుణ్ ధావన్, ఆలియా భట్‌లను కూడా సంప్రదించారట. అయితే వరుణ్ ధావన్ సుముఖంగానే ఉన్నా, ఇప్పటికే అంగీకరించిన చిత్రాల కారణంగా ఆలియా మాత్రం ఈ సినిమాలో నటించలేకపోతున్నారట. ఈ నేపథ్యంలో ఈ చాన్స్ జాన్వీ కపూర్‌కు వెళ్లిందట. ఈ సినిమాకు జాన్వీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ ఊపందుకున్నాయని టాక్. వేసవిలో షూటింగ్ ఆరంభించాలనుకుంటున్నారని సమాచారం.

ఐదు రోజులు గాల్లోనే ఉన్నాను

- తేజ సజ్జా

"ప్రతి యాక్టర్ కెరీర్‌లో ఓ బెంచ్ మార్క్ ఫిల్మ్ ఉంటుందంటుంటారు. నా కెరీర్‌లో 'హను–మాన్'ని నా బెంచ్ మార్క్ ఫిల్మ్‌గా ఫీలవుతున్నాను. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. క్లైమాక్స్‌లో ఓ సన్నివేశం కోసం రోప్ సాయంతో ఐదు రోజులు గాల్లోనే ఉన్నాను. రెండున్నరేళ్లు ఏ సినిమా ఒప్పుకోలేదు. యాక్టర్‌గా నా కెరీర్ పరంగా, నా వయసు పరంగా ఈ రెండున్నరేళ్ల కాలం చాలా కీలకమైనది. 'హను–మాన్' సక్సెస్ కావడం సంతోషంగా ఉంది" అని తేజ సజ్జా అన్నారు. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'హను–మాన్'. కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలైంది. 'హను–మాన్'కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని చెబుతూ, శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో తేజ సజ్జా పంచుకున్న విశేషాలు.

- తెలుగుతో పాటు హిందీ, కన్నడ వంటి భాషల్లో కూడా 'హను–మాన్' బాగా ఆడుతున్నందుకు సంతోషంగా ఉంది. గత ఏడాది నుంచి ఇప్పటివరకు ఏ తెలుగు సినిమాకీ రానంత స్పందన ఈ సినిమాకు హిందీలో వస్తోందని చెబుతున్నారు. మా సినిమాకు కాస్త సింపతీ వర్కౌట్ అయ్యిందని అనడం కరెక్ట్ కాదు. ఎందుకంటే మా సినిమా ట్రైలర్, టీజర్ చూసి హిందీ, కన్నడవారు మమ్మల్ని అడిగి సినిమా తీసుకున్నారు. ఏం జరిగినా అంతిమంగా సినిమానే మాట్లాడుతుంది. సినిమానే నిలబడుతుంది. నిర్మాత నిరంజన్‌రెడ్డిగారు, ప్రశాంత్‌వర్మ 'హను–మాన్' సినిమాను బాగా చేశారు.
- 'హను–మాన్' సినిమా సమయంలో నేను ఇతర సినిమాలు ఒప్పుకోకపోవడానికి కారణం ఆ సినిమాల ఇంపాక్ట్ 'హను–మాన్'పై పడకూడదని. ఈ సినిమా సక్సెస్ మా అందరిదీ. ఈ సినిమా యూనిట్ సభ్యులు వారి వారి డిపార్ట్‌మెంట్స్‌లోనే కాక, ఇతర క్రాఫ్ట్స్‌లో కూడా కలుగజేసుకుని బాధ్యతగా చేశారు. ఉదాహరణకు నా లుక్ లోని కొన్ని కాస్ట్యూమ్స్‌కు మా సినిమా ఆర్ట్ డైరెక్టర్ వర్క్ చేశారు. ఈ సినిమా విషయంలో మొదట్నుంచి ఏదో ఆధ్యాత్మిక శక్తి మమ్మల్ని ముందుకు నడిపిందని నా నమ్మకం. 'హను–మాన్' సినిమాను మేం చేయలేదు. 'హను–మాన్' సినిమా మా చేత చేయబడింది. ఈ సినిమాకు లాంగ్ రన్ ఉంటుందని మేం అనుకుంటున్నాం.
- 'హను–మాన్' సినిమాలోని హనుమంతుని విగ్రహం సినిమాకు ఆకర్షణగా నిలిచింది. గ్రాఫిక్స్ అలా చేయడానికి ఆరు నెలల సమయం పట్టింది. క్లైమాక్స్ చిత్రీకరణకు 60 రోజులకు పైగా సమయం పట్టింది. 'హను–మాన్' ప్రాజెక్ట్ గురించి చిరంజీవిగారికి తెలుసు. ఈ సినిమాలోని హనుమంతుని పాత్ర గురించి ఆయనకు తెలుసు. మా ఇంటెన్షన్ హనుమంతుని పాత్రలో చిరంజీవిగారు అనే. ఆ సంగతి అలా ఉంచితే చిరంజీవిగారు ఇంకా 'హను–మాన్' సినిమా చూడలేదు. అయితే రిలీజైన రోజున శుభాకాంక్షలు చెబుతూ మెసేజ్ పంపారు.

